హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అంబేద్కర్ విగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం నడిబొడ్డున 125 అడుగుల ఎత్తులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందిస్తూ దేశ వ్యాప్తంగా ప్రశంసల పరంపర కొనసాగుతున్నదని ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఆ విగ్రహం పేరు నమోదైందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను సిఎం కెసిఆర్ పేరు మీద మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. విగ్రహ నిర్మాణం దేశ, విదేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులు ప్రసార మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు చెబుతున్నారని వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రపంచ స్థాయిలోనే అంబేద్కర్ విగ్రహం టూరిజం కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

మే 16న ఎఒ పరీక్ష

- వాయిదా పడ్డ పరీక్షలకు కొత్త తేదీలు
- టిఎస్‌పిఎస్‌సి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాయిదా పడ్డ పలు పోటీ పరీక్షలకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) కొత్త తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే 16న అగ్రికల్చర్ ఆఫీసర్ (ఎఒ) పోస్టులకు రాతపరీక్షలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మే 19న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, జూన్ 28న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ), జులై 18, 19 తేదీల్లో భూగర్భ జలశాఖలో గెజిటెడ్ పోస్టులకు, జులై 20న భూగర్భ జలశాఖలో నాన్ గెజిటెడ్ పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించనున్నట్టు వివరించారు. పూర్తి వివరాలకు టిఎస్‌పిఎస్‌సి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో ఆయా పోస్టులకు ప్రకటించిన రాతపరీక్షలను టిఎస్‌పిఎస్‌సి వాయిదా వేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీతోపాటు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డిఎఒ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పరీక్షలను రద్దు చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ ఐదు నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు టిఎస్‌పిఎస్‌సి ఇప్పటికే ప్రకటించింది.

జీరో కాస్ట్ ఇఎంఐలో విద్యా ఫీజులు

- ప్రేక్ష ఎడ్యుటెక్ శ్రీకారం

హైదరాబాద్ : స్టార్టప్ సంస్థ 'ప్రేక్ష ఎడ్యుటెక్' వినూత్న ఒరవడికి నాంది పలికినట్లు తెలిపింది. విద్యా సంబంధిత ఫీజులను ఇఎంఐ పద్ధతిలో చెల్లించడానికి తల్లిదండ్రులకు సహాయపడనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. అధిక విద్యా వ్యయంతో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం చేయడానికి జీరో-కాస్ట్ ఫీజు ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించనున్నట్లు ప్రేక్ష ఎడ్యుటెక్ వ్యవస్థాపకుడు కోనేరు రవితేజ తెలిపారు. రెండు లక్షల మంది విద్యార్థులకు ఫైనాన్సింగ్ అందించడానికి 50 ప్రతిష్టాత్మక పాఠశాలలు, కళాశాలలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామన్నారు. పూర్తి వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

ఢిల్లీలో మిలీనియం మార్చ్ చేయాలి

- బిజెపికి మంత్రి తలసాని సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిన బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బిజెపి నాయకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులతో మిలీనియం మార్చ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి నాయకులకు దమ్ముంటే ఢిల్లీలో మిలీనియం మార్చ్ చేయాలని సవాలు విసిరారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో శనివారం జరిగిన బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఎన్ని భర్తీ చేసిందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ ప్రభుత్వం 1.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందని, 90 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. గత ప్రభుత్వాలు అంబేద్కర్ పేరును ఉపయోగించుకొన్నాయే తప్ప సరైన గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ మాత్రమే దేశంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసి నిజమైన గౌరవం కల్పించారని వెల్లడించారు. కేంద్రం నుంచి తీసుకొచ్చి అభివృద్ధి చేయడం చేతకాని బిజెపి నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి నాలుగు సంవత్సరాలలో ఎన్ని నిధులు తెచ్చారని, ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా? అని తలసాని ప్రశ్నించారు.

జవహర్‌నగర్ చెత్త దుర్గంధానికి చెక్

- రూ.250 కోట్లతో లీచెట్ శుద్ధి నిర్వహణ ప్లాంట్ ప్రారంభం
- మాట ఇచ్చా.. పట్టాలు అందజేస్తున్నా
- ఐటి, పురపాలకశాఖ మంత్రి కెటిఆర్
- కార్పొరేషన్ అభివృద్ధికి మరో రూ.30 కోట్లు మంజూరు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"దేశంలోనే హైదరాబాద్ నగరం ఆదర్శం కానుంది.. ఆరు నెలల కిందట జవహర్ నగర్‌కు వచ్చా.. పట్టాలు అందజేస్తానని మాటా ఇచ్చా.. ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకుంటున్నందుకు సంతోషంగా ఉంది.. ఇకపై జవహర్‌నగర్ చెత్త దుర్గంధం నుంచి విముక్తి కలగనుంది" అని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని డంపింగ్ యార్డ్‌లో రూ.250 కోట్లతో ఏర్పాటు చేసిన 2000 కెఎల్‌డి సామర్థ్యం గల కాలుష్యకారక వ్యర్థాల (లీచెట్) శుద్ధీకరణ ప్లాంట్‌ను మంత్రి మల్లారెడ్డితో కలిసి కెటిఆర్ శనివారం ప్రారంభించారు. అనంతరం కాప్రా తహసీల్దార్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిఒ 58 కింద పేదలకు కెటిఆర్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంప్ యార్డ్ నుంచి ఉత్పత్తి అయ్యే లీచెట్ కారణంగా మల్కారం చెరువు కలుషితం అవుతోందన్నారు. ఆ చెరువుతో పాటు డంప్ యార్డు చుట్టుపక్కల చెరువుల్లో ఉన్న లీచెట్ శుద్ధీకరణ ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మల్కారం చెరువు శుద్ధిని సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని మంత్రికి రాంకీ సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ మొదలు పెట్టినప్పుడు హైదరాబాద్ నుంచి 3వేల మెట్రిక్ టన్నుల చెత్త వస్తుందని లెక్క వేసిందని, అందుకనుగుణంనే ఈ ప్లాంట్‌ను డిజైన్ చేశారని చెప్పారు. ఇప్పుడు 8వేల మెట్రిక్ టన్నుల చెత్త వస్తుందని, ఇంకో వెయ్యి టన్నులు అయితే మూడు రెట్ల చెత్త అవుతుందని అన్నారు. ఇక్కడ తడి చెత్త నుంచి ఎరువు ఉత్పత్తి చేసి.. రైతులకు అమ్ముతున్నామని చెప్పారు. పొడి చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. రూ.550 కోట్లతో దక్షిణ భారతదేశంలోనే పెద్దదైన చెత్త నుంచి కరెంట్ ఉత్పత్తి యూనిట్‌ను గతంలోనే ప్రారంభించామన్నారు. 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందని, ఇప్పుడు దానికి రెండో దశ కొనసాగుతోందని అన్నారు. మరో రూ.550 కోట్లతో 28 మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణం జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్ నుంచి వచ్చే మొత్తం చెత్తతో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడమే తమ లక్ష్యం అన్నారు. చెత్త నుంచి కన్‌స్ట్రక్షన్ అండ్ డెమాలిషన్ వేస్ట్ తయారు చేసే రెండు ప్లాంట్లు పెట్టామన్నారు. బ్రిక్స్, సిమెంట్, ఫుట్‌పాత్ మీద వేసే టైల్స్ తయారు చేస్తున్నామన్నారు. జవహర్‌నగర్‌లో 8 వేల టన్నుల చెత్త వేయడం సాధ్యం కానందున దుండిగల్ దగ్గర 1500 టన్నుల చెత్తను అక్కడికి తరలించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మరో 1500 టన్నుల చెత్తను ఇంకో ప్లేస్‌కు తరలిస్తామన్నారు. దీంతో జవహర్‌నగర్‌లో లోడ్ తగ్గుతుందని, దీంతో ఈ ప్రాంలో జనాలకు ఇబ్బందులు తప్పుతాయని అన్నారు.

కార్పొరేషన్‌లో 3619 పట్టాలు వంపిణీ

మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీలో జిఒ 58, 59లను 2020 వరకు పెంచాలని కోరడంతో సిఎం కెసిఆర్ వెంటనే జిఒ జారీ చేశారని కెటిఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో ఇప్పటికే లక్ష పట్టాలు అందజేశామన్నారు. కార్పొరేషన్‌లోని పేద ప్రజలు జీవో 58, 59కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మేయర్ మేకల కావ్య కొన్ని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు, ఇండ్లు నిర్మించుకున్న పేదలు జీవో 58 కింద దరఖాస్తు చేసుకోగా.. 3619 వట్టాలు మంజురయ్యాయి.

మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు నివసించే జవహర్‌నగర్ తన గుండె, శ్వాస అని అన్నారు. కార్పొరేషన్‌లో రూ.120 కోట్లతో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా ఉచితంగా నల్లా కనెక్షన్ ఇచ్చామని చెప్పారు. రోడ్లు, డ్రయినేజీ, విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జవహర్‌నగర్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ అమోయ్ కుమార్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, అదనవు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీవో రవి, జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ ఆర్ఎస్.శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ భ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో రాయల్‌ఓక్ 18 స్టోర్లకు విస్తరణ

హైదరాబాద్ : ఫర్నిచర్ బ్రాండ్ రాయల్‌ఓక్ దేశ వ్యాప్తంగా 148 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లోని రామచంద్రాపురం వద్ద నూతన స్టోర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. నూతన స్టోర్‌ను నటుడు నిఖిల్ సిద్ధార్థ, రాయల్‌ఓక్ ఫర్నిచర్ చైర్మన్ విజయ్ సుబ్రమణియం, ఎండి మథన్ సుబ్రమణియం లాంఛనంగా ప్రారంభించారు. దాదాపు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఇది తమకు 18వ స్టోర్ అని విజయ్ సుబ్రమణియం తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం

- వీల్‌చైర్ తెచ్చేలోగా రోగిని లాక్కెళ్లిన తల్లిదండ్రులు
- ఆ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్
- జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సమయానికి స్ట్రెచర్ లేకపోవడంతో లిఫ్ట్ ఆగిందని పేషెంట్ కాళ్లను పట్టుకొని లాక్కుంటూ వెళ్లిన వీడియో ఫుటేజీ శనివారం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. గత నెల 31వ తేదీన జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఓ పేషెంట్‌ను అపస్మారక స్థితిలో తీసుకొచ్చారు. స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో పేషెంట్‌ని కుటుంబ సభ్యులు నేలపై పడుకోబెట్టి, రెండు కాళ్లు పట్టి లాక్కెళ్లడం వీడియోలో ఉండటంతో కలకలం రేపింది.

కాగా ఈ ఘటనపై వైద్యారోగ్య శాఖ మంత్రి విచారణకు ఆదేశించారు. దాంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో మెరుగైన వైద్యం కల్పిస్తుండటంతో ప్రయివేటు ఆస్పత్రులు ఖాళీ అవుతున్నాయని, ఇది ఓర్వలేక జీజీహెచ్‌పై కుట్రలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే రోగి కాళ్లు పట్టుకుని లాగుతున్న పది సెకన్ల వీడియోను పోస్టుచేసి ఆస్పత్రిపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతిసే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. పేషెంట్ కేర్ సిబ్బంది చక్రాల కూర్చీ తీసుకొచ్చే లోగా.. లిఫ్ట్ వచ్చిందని తల్లిదండ్రులు ఆ రోగిని లాగుతూ తీసుకెళ్లారని వివరించారు. రెండో అంతస్తులో పేషెంట్ కేర్ సిబ్బంది వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత మళ్లీ వీల్‌చైర్‌లోనే గ్రౌండ్‌ఫ్లోరుకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ మేరకు సీసీ కెమెరాల వీడియోను కూడా ఆమె పోస్టు చేశారు. ఇదంతా తెలియక ఎవరో ఒక వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారని, సమగ్రమైన అవగాహన లేకుండా, పూర్తి సమాచారం తెలియకుండా ఇలాంటి వీడియోలు తీసి ప్రభుత్వ ఆస్పత్రులపై దుష్ప్రచారాలు చేయడం చాలా బాధాకరమన్నారు. ఆ రోజు రోగిని లాగుతున్న సమయంలో వీడియో తీస్తున్న వ్యక్తిని సిబ్బంది ప్రశ్నించడంతో అక్కడి నుంచి జారుకున్నాడని తెలిపారు. జీజీహెచ్‌లో సరిపడా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు ఉన్నాయని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో 57 స్ట్రెచర్లు, 51 వీల్‌చైర్లు, స్టోర్‌లో మరో 41 వీల్‌చైర్లు ఉన్నాయని తెలిపారు. పైగా ఆస్పత్రిలో సుమారు 200 సీసీ కెమెరాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు 24 గంటలు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో జీజీహెచ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని, ఈ సమయంలో ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం సరికాదని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిమారాజ్

కూచిపూడి నాట్యానికి చిరునామా శోభనాయుడు

- ప్రముఖ నాట్యగురువులు

ప్రజాశక్తి-కల్చరల్

కూచిపూడి నాట్యంలో ఎందరో ఉద్దండ పండితులు ఉన్నా శోభ నాయుడు వేలాది మందికి శిక్షణ ఇచ్చి ప్రపంచ వ్యాప్తికి కృషి చేసి ఆ నాట్యకళకు చిరునామాగా గుర్తింపు పొందారని ప్రముఖ నాట్య గురువులు అన్నారు. రెండు రోజులు శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై పద్మశ్రీ డాక్టర్ శోభా నాయుడు శిష్య బృందం సుజాతామూర్తి, లావణ్య, ఉషా కిరణ్, పూర్ణిమ, భాస్కర్ తడితరులు శోభనాయుడు జయంత్యోత్సవం నిర్వహించారు. తొలి రోజు ముఖ్య అతిథిగా పద్మశ్రీ పద్మజ రెడ్డి పాల్గొని మృదంగ కళాకారుడు పే.ఆర్.సి.శర్మను సత్కరించారు. శోభా నాయుడు నాట్య కళ పట్ల ఉన్న అంకిత భావాన్ని వివరించారు. ఆంధ్ర నాట్య గురువు కళా కృష్ణ, కూచిపూడి నాట్య గురువు యశోదా ఠాకూర్ పాల్గొన్నారు. రెండవ రోజు ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నృత్య శాఖ ఆచార్యులు డాక్టర్ జొన్నలగడ్డ అనూరాధ పాల్గొని ప్రముఖ గాయకుడు కన్నారావును సత్కరించి మాట్లాడారు. శోభ నాయుడు నాట్యం మాత్రమే నేర్పలేదని, సంస్కారం సంగీత సాహిత్యలపై అవగాహన నేర్పారని, వాటిని కొనసాగించాలని సూచించారు. నాట్య గురువు భాగవతుల సేతురాం సుమలత పాల్గొన్నారు. రెండు రోజుల కార్యక్రమాల్లో లావణ్య, ఉష కిరణ్, పూర్ణిమలు ప్రదర్శించిన షిర్డీ సాయి అంశం, కృష్ణ భారతి, పద్మజా రెడ్డి శిష్యులు సంజన ప్రదర్శనలు రెండవ రోజు అపర్ణ, వైష్ణవి, ప్రవీణ, తడితరులు నర్తించిన యాదగిరి నృసింహ రూపకం, శివ రంజని నాయుడు బృదం శివ స్తుతి, విజయ శాస్త్రి తదితరులు నాట్య అంశాలు ఆకట్టుకున్నాయి.



17 నుంచి పద్య నాటకోత్సవం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రవీంద్రభారతి ప్రధాన వేదికపై గుమ్మడి గోపాలకృష్ణ ఫౌండేషన్ నిర్వహణలో పద్య నాటకోత్సవాలు ఈ నెల 17,18, 19 తేదీల్లో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో పరిషత్ చైర్మన్ డాక్టర్ కెవి.రమణాచారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనీల్ కుమార్‌తో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. గుమ్మడి గోపాలకష్ణ పద్య నాటక ప్రదర్శనలో విశేష ప్రతిభావంతుడని కొనియాడారు. ప్రజాదరణ పొందిన నాటకాలు సత్యసాయి కళానికేతన్ వారిచే సత్య హరిశ్చంద్ర, శ్రీనాధుడు, యోగి వేమన వరుసగా 17, 18, 19 తేదీల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రధాన పాత్రలో గుమ్మడి గోపాలకష్ణ నటిస్తారని వివరించారు. గోపాల కృష్ణ తమ ఫౌండేషన్ లక్ష్యాలు తెలుపుతూ యువ నటులకు శిక్షణ పేద వృద్ధ కళాకారులను ఆర్థికంగా అదుకోవడం తదితర కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు పత్రికా సమావేశంలో సతీష్ పాల్గొన్నారు

జూన్1 నాటికి పనులన్నీ పూర్తి కావాలి

- అధికారులకు మంత్రి కెటిఆర్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎన్‌డిపి కార్యక్రమం కింద జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టిన పనులన్నీ జూన్1 నాటికి పూర్తి చేయాలని పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అధికారులను ఆదేశించారు. నాలాల అభివృద్ధి, వర్షాకాల సన్నద్ధతపై శనివారం ఆయన ఇక్కడ జిహెచ్‌ఎంసి అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిఆర్ పలు కీలక సూచనలు చేశారు. వర్షాకాలంలో ఎదురయ్యే అన్ని పరిస్థితులకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జూన్ 1వ తేదీ నాటికి సన్నద్ధత పనులు పూర్తి కావాలన్నారు. వర్షాకాలం నాటికి పనులు పూర్తయితే ముంపును నివారించొచ్చు. నాలాల్లో ఉన్న అడ్డంకులు, పూడికను తొలగించాలి. వాటర్ లాంగింగ్ పాయింట్లు, రోడ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. వాటర్ సీవరేజ్, స్ట్రామ్ వాటర్ డ్రైనేజీల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలన్నారు. మ్యాన్‌హోళ్ల నిర్వహణపై శ్రద్ధ వహించాలి. ప్రమాదానికి అవకాశం ఉన్న పాత భవనాల గుర్తింపు అత్యంత కీలకం అని కెటిఆర్ పేర్కొన్నారు. గడువులోగా పనులు చేయడంలో విఫలమవుతున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోరుట్లలో సిపిఎం నాయకునిపై దాడి

- భూపోరాటం ఆపాలని చుట్టుముట్టిన కౌన్సిలర్ భర్త, అనుచరులు
- పిడిగుద్దులతో చావబాది.. చంపుతామని బెదిరింపులు
- దాడిని ఖండించిన సిపిఎం రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిలువనీడ లేని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని జగిత్యాల జిల్లా కోరుట్లలో భూపోరాటం చేస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్‌పై స్థానిక వార్డు కౌన్సిలర్ భర్త, అతని అనుచరులు దాడికి తెగబడ్డారు. ఒంటరిగా బైక్‌పై వెళున్న తిరుపతినాయక్‌ను కాపుకాచి వెంబడించి అడ్డగించారు. సుమారు 20 మంది మూకుమ్మడిగా పిడిగుద్దులు కురిపించారు. 'మళ్లీ అలగా జనాన్ని వేసుకుని ఇండ్ల స్థలాలు అంటూ పోరాడితే చంపుతాం' అంటూ బెదిరించారు. చుట్టుపక్కల జనం, సిపిఎం నాయకులు చేరుకోవడంతో గుండాలు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దాడిని తీవ్రంగా ఖండించిన ఆ పార్టీ నాయకులు. ఇదే సమయంలో రెవెన్యూ, పోలీసులు అధికారులు పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించారు. ఆ ఘటనపై సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య తీవ్రంగా ఖండించారు.


సిపిఎం జగిత్యాల జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లల బాలకృష్ణ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని పేదలు ఇండ్ల స్థలాల కోసం ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నారు. పట్టణంలోని సర్వేనెంబర్ 922, 923లోని ప్రభుత్వ భూమిలో ఇంటి కోసం కాస్త స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. రోజువారీ ఆందోళనలో భాగంగానే శనివారం కూడా ఆ స్థలంలో సమావేశమై సాయంత్రం తిరిగి ఎవరి ఇండ్లకు వాళు వెళ్లిపోయారు. ఇదే సమయంలో పేదల పక్షాన నాయకత్వం వహిస్తున్న తిరుపతినాయక్‌ను టార్గెట్ చేసుకుని 18వ వార్డు కౌన్సిలర్ భర్త రహీమ్, అతని అనుచరులు మధ్యాహ్నం నుంచే కాపుకాస్తున్నారు. నిరసన స్థలం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్న తిరుపతినాయక్‌ను సాయంత్రం 6గంటల సమయంలో పట్టణంలో అడ్డగించారు. దుర్భాషలాడుతూ మూకుమ్మడిగా దాడికి తెగబడ్డారు. పిడిగుద్దులు కురిపించారు. 'ఆ భూమిలో మళ్లీ అడుగు పెడితే చంపుతాం' అంటూ బెదిరించారు. అప్పటికే చుట్టుపక్కల జనం, విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఘటనాస్థలానికి చేరుకోగానే రహీమ్, అతని అనుచరులు జారుకున్నారు.

పేదలు నిరసన తెలుపుతున్న స్థలంలో చెట్ల తొలగింపు

ఇంటి స్థలాల కోసం ప్రభుత్వ భూమిలో పేదలు నిరసన తెలుపుతున్నారు. ఆ స్థలంలోని చెట్టు కింద ప్రతిరోజూ కూర్చుని తమ డిమాండ్ల గళాన్ని వినిపిస్తున్నారు. అక్కడే గుడిసెలూ వేసుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు తొలుత అడ్డుకున్నారు. తరువాత సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణను రెండ్రోజుల కింద అరెస్టు చేశారు. ఏ స్టేషన్‌కు తీసుకెళ్తున్నారో చెప్పకుండా కోరుట్ల, కథలాపూర్‌లో తిప్పారు. తమ నాయకుని అరెస్టు విషయం తెలుసుకుని పేదలంతా ఆందోళనకు దిగడంతో చేసేదిలేక పోలీసులు బాలకృష్ణను వదిలేశారు. మర్నాడు ఉదయం నుంచి మళ్లీ యథావిధిగా పోరాటాన్ని కొనసాగించారు. శనివారం సాయంత్రం తిరుపతినాయక్‌పై స్థానిక అధికారపార్టీ నాయకుడు, శ్రేణులు దాడి చేస్తే.. పోలీసులు, రెవెన్యూ అధికారులు మాత్రం పేదలు నిరసన తెలుపున్న ప్రదేశంలోని చెట్టును జేసీబీతో తొలగించారు.

దాడులకు బెదరం.. ఆగదు ఈ పోరాటం
సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బాలకృష్ణ

దాడులతో ఉద్యమాలను ఆపలేరు. పేదల కోసం ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఎదురీడి పోరాడే చరిత్ర ఎర్రజెండాకు ఉంది. మా నాయకునిపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పోలీసులు వారిని అరెస్టు చేయాలి. దాడులకు దిగినా.. బెదిరింపులకు పాల్పడినా ఆగేది కాదు ఈ భూపోరాటం. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేవరకూ మా ఉద్యమం కొనసాగుతుంది.



అవార్డులు రావడంలో సెర్ప్ ఉద్యోగుల పాత్ర కీలకం

- రాష్ట్రం పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధిలో రాష్ట్రానికి అవార్డులు రావడంలో సెర్ప్ ఉద్యోగుల పాత్ర కీలకమని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతోందని విమర్శించారు. సెర్ప్ ఉద్యోగుల చిరకాల కోరిక పే స్కేల్ పెంపు అమలైన సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో నాలుగు వేల మందితో శనివారం కృతజ్ఞత సభ నిర్వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సెర్ప్ ఉద్యోగుల కృషి గొప్పదని కొనియాడారు. అప్పటి ప్రభుత్వాలు సెర్ప్ ఉద్యోగుల మీద ఉక్కుపాదం మోపితే.. ఇప్పుడు కేసీఆర్ మంచి వేతనాలు ఇచ్చి ఆదుకుంటున్నారని చెప్పారు. సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఫిట్‌మెంట్ అమలు చేశారన్నారు. కరోనా వంటి ఎన్నో ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై కక్షగట్టి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ లేని రుణాల విషయంలో కేంద్రం సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే సొంత నిధులతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటామని చెప్పారు. ప్రేమ, అభిమానంతో ఇంత పెద్దఎత్తున సెర్ప్ ఉద్యోగులు రావడం పట్ల అభినందనలు తెలిపారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. సెర్ప్ ఉద్యోగుల కృషి వల్లే సంఘాలు ఐకెపిగా ఏర్పడి చాలా అద్భుతంగా పని చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి పోయిందన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాల విషయంలో ప్రత్యేక కృషితోనే మహిళా సాధికారత సాధ్యమైందని చెప్పారు.

ఒకే రోజు రెండు ప్రవేశ పరీక్షలు

- నేడే మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో సీట్ల భర్తీకి ఎగ్జామ్స్
- ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో, గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఆదివారం ఒకేరోజు జరుగుతున్నాయి. దీంతో రెండు పరీక్షలకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాతపరీక్ష జరగనుంది. అదేరోజు గురుకుల విద్యాలయాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే రాతపరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటగంట వరకు నిర్వహించనున్నారు. చాలా మంది విద్యార్థులు రెండు పరీక్షలకు దరఖాస్తు చేశారు. కానీ పరీక్ష రాసేందుకు ఒకే సమయం ఉండడంతో మానసికంగా ఆవేదనకు గురవుతున్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు కూనంనేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. 2013 వేతన సవరణ సందర్భంగా ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వోద్యోగుల కంటే ఎక్కువగా 43 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆ తర్వాత 2017, 2021 రెండు వేతన సవరణలు ఇప్పటికీ ఆర్‌టిసి కార్మికులకు అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఈ రెండు వేతన సవరణలను వెంటనే అమలు జరిపి వారిని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు.

సీతారామ సొరంగ'మార్గమే'..!

- ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్..!
- వారంలోగానే అధికారిక ఉత్తర్వులు
- 16వ ప్యాకేజీలో రూ.300 కోట్ల వరకు ఆదా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం 16వ ప్యాకేజీ నిర్వాసిత రైతులకు ఉపశమనం లభించనుంది. ఈ ప్యాకేజీ పరిధిలో ప్రాజెక్టు సొరంగ మార్గానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దీని ద్వారా ప్రభుత్వానికి నిధుల ఆదాతోపాటు భూసేకరణ నుంచి 534 ఎకరాల మినహాయింపు కానుంది.

గోదావరి- కృష్ణా జలాలను అనుసంధానించడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలో ఆరు లక్షలకు పైగా ఎకరాలను సస్యశ్యామలం చేయొచ్చనే ఉద్దేశంతో ఏడేండ్ల కిందట తెలంగాణ ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రస్తుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొద్దిపాటి మార్పులతో దుమ్ముగూడెం పేరు మార్చి సీతారామ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టులు రావడం హర్షదాయకమే అయినా భూములు కోల్పోతున్న రైతాంగానికి మాత్రం ఇది ఒకింత బాధాకరమే.

ప్రత్యామ్నాయాలపై నివేదిక

రైతుల డిమాండ్ల మేరకు అవకాశం ఉన్నచోట ప్రత్యామ్నాయాలపై జిల్లా నీటిపారుదల శాఖ దృష్టి సారించింది. దానిలో భాగంగానే 16వ ప్యాకేజీలో భూపరీక్షలు నిర్వహించి సొరంగమార్గానికి అవకాశం ఉందని ప్రభుత్వానికి ఏడాది కిందట నివేదించింది. దీనివల్ల ప్రయోజనాలు, సాధ్యాసాధ్యాలను సైతం ఆ నివేదికలో పొందుపరిచింది. దాదాపు ఏడెనిమిది నెలలుగా ముఖ్యమంత్రి పేచిలో పెండింగ్‌లో ఉన్న ఈ అంశం కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. వారంలోగానే దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఫలించిన నీటిపారుదల శాఖ కృషి

సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా జిల్లాలో భూములు కోల్పోతున్న రైతులు సుమారు నాలుగువేల మందికిపైగా ఉన్నారు. వీరిలో అత్యధికులు మూడు ఎకరాల్లోపు ఉన్న సన్న,చిన్నకారు రైతులే. పరిహారం విషయంలో ప్రభుత్వం న్యాయం చేయలేని పరిస్థితి ఉంది కాబట్టి అవకాశం ఉన్నచోట సొరంగ మార్గాలు నిర్మించాలని జిల్లా నీటిపారుదల శాఖ భావించింది. 16వ ప్యాకేజీలో అందుకు అనువైన భూములు ఉన్నట్టు గుర్తించి, పరీక్షలు నిర్వహించింది. సంబంధిత నివేదికను రాష్ట్ర నీటిపారుదల శాఖకు పంపింది. దీనిపై పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సీఈ శంకర్‌నాయక్, డిఇ బాణాల రమేష్‌రెడ్డి చర్చించారు. ఈ భూములు పాలేరు నియోజకవర్గం పరిధిలో ఉన్న దృష్ట్యా అక్కడి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సైతం చొరవ చూపారు. ఇటు భూములు కోల్పోతున్న రైతుల పక్షాన కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు నిర్వహించాయి. ఈ ప్రయత్నాలన్నీ ఓ కొలిక్కి వచ్చాయి. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సైతం టన్నెల్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

టన్నెల్‌తో ప్రయోజనాలు

16వ ప్యాకేజీలో 8 కి.మీ మేర సొరంగ మార్గం ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలత తెలిపినట్టు తెలుస్తోంది. దీని ద్వారా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లోని సుమారు 200 మంది రైతులకు చెందిన 534 ఎకరాల భూములు సేకరణ నుంచి మినహాయింపు పొందాయి. ఇక్కడ బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.40 లక్షలకు పైగా భూమి ధర ఉంది. కానీ ప్రభుత్వం పరిహారంగా రూ.18లక్షలు మాత్రమే ప్రకటించింది.

తొలుత రూ.12 లక్షలు మాత్రమే పరిహారంగా ప్రకటించడంతో రైతులు పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. ఫలితంగా దీనిని రూ.18 లక్షలకు పెంచారు. కొంతమంది రైతులకు ఇప్పటికే ఈ పరిహారం అందగా మిగిలిన రైతులు కూడా వేచిచూస్తున్నారు. ఈ క్రమంలోనే టన్నెల్‌కు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్టు తెలుస్తోంది. దీనివల్ల రైతుల భూములతో పాటు ప్రభుత్వానికి రూ.300 కోట్ల వరకు ఆదా అవుతున్నాయి.

రైతుల్లో హర్షం

శంకర్‌నాయక్- చీఫ్ ఇంజినీర్

టన్నెల్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఇప్పుడిప్పుడే సానుకూలత వస్తోంది. అయితే, దానికి కొంత సమయం పట్టొచ్చు. మరోవారం రోజుల్లో ఉత్తర్వులు రావచ్చు. సొరంగం ఏర్పాటైతే రైతులు మమ్మల్ని సత్కరిస్తామంటూ హర్షం వెలిబుచ్చుతున్నారు.

సొరంగం వస్తే నా భూమి దక్కినట్టే..

దామళ్ల వీరమ్మ- నిర్వాసిత రైతు

సీతారామ ప్రాజెక్టు కింద నాకున్న ఎకరన్నర భూమి పోతుంది. పరిహారం కూడా చాలా తక్కువ వస్తుంది. దాదాపు మూడు నాలుగేండ్లుగా కంటికి కడివెడు దు:ఖంతో ఉన్నాం. ఉన్న భూమంతా ప్రాజెక్టు కింద పోతే ఎలా బతకాలని నా పిల్లలు, నేను అనేక మార్లు కుమిలిపోయాం. ఇప్పుడు సొరంగం వస్తుందంటే నా ప్రాణం లేచివచ్చినట్టుగా ఉంది. సొరంగం వచ్చి మా భూమి పోకుండా ఉంటే సార్లకు సత్కారం చేస్తాం.

పర్యాటకంపై కేంద్రం చిన్నచూపు

- ప్రభుత్వం ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు
- సంఘం వైస్ చైర్మెన్ వినోద్‌కుమార్ విమర్శ
- టూరిజం కార్పొరేషన్ చైర్మెన్‌గా శ్రీనివాస్ బాధ్యతలు
- టూరిజం హబ్‌గా తెలంగాణ : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలోని పర్యాటక రంగంపై బిజెపి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ఆ పార్టీకి చెందిన నలుగురు రాష్ట్ర ఎంపిలు ఏనాడూ టూరిజం గురించి మాట్లాడలేదని ప్రణాళిక సంఘం వైస్‌చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. టూరిజం కార్పొరేషన్ చైర్మెన్‌గా గెల్లు శ్రీనివాస్‌యాదవ్ బాధ్యత స్వీకరించిన సందర్భంగా నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ టూరిజం గురించి కేంద్రానికి ఎన్నిసార్లు విన్నవించినా చీమకుట్టినట్టుగా కూడ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వేములవాడ, యాదాద్రి, కొండగట్టు, కాళేశ్వరం, జోగులాంబ లాంటి గొప్ప గొప్ప దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ఉన్నా ప్రాచుర్యం పొందకుండా అడ్డుకున్నారని తెలిపారు. బెంగుళూరులో ఉన్న బృందావన్ గార్డెన్ కంటే నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం తక్కువేమి కాదని గుర్తుచేశారు. కాని బుద్ధవనం ప్రాచుర్యం పొందకుండా కుట్రలు చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. రామప్ప టెంపుల్‌కు యునెస్కో గుర్తింపు రాలేదని, 2004 నుంచి ఎంతో కృషిచేశామని తెలిపారు. పర్యాటకం శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, మెడికల్ టూరిజం ఇలా రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో టూరిజం అభివృద్ధికి శాయశక్తుల కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండాప్రకాష్ ముదిరాజ్, మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి

- బండికి మంత్రి కొప్పుల హితవు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని రాష్ట్ర ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హితవు పలికారు. 125 అడుగుల భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అవిష్కరించుకున్న సందర్భంగా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమన్నారు. ఆయనకు మతి భ్రమించి మాట్లాడుతున్నారనీ, ప్రతిష్టాత్మక విగ్రహావిష్కరణను చూసి జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. బిఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారనీ, వీటిని మానుకోవాలని హెచ్చరించారు. పేపర్ లీకేజీ ఘటనలో పట్టు బడిన దొంగ బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. దళిత జనోద్ధారణ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు. తెలంగాణ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు విమర్శలు చేస్తున్నారా?లేక నూతన పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తున్నందుకు విమర్శిస్తున్నారా? అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకోక పోతే ప్రజలే తగిన రీతిలో సమాధానం చెబుతారని కొప్పుల ఈ సందర్భంగా హెచ్చరించారు.

ధరణిపోర్టల్ ఓ డిజిటల్ విపత్తు

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ధరణిపోర్టల్ అమల్లో నెలకొన్న లోపాల కారణంగా రైతులకు అది డిజిటల్ విపత్తుగా మారిందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమ విమర్శించారు. గ్లోబల్ ఐటీ కేంద్రంగా ఉన్న హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతిన్నదని విమర్శించారు. లోపభూయిష్టమైన ల్యాండ్ రికార్డు డిజిటలైజేషన్ పోర్టల్ కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వేలాది మంది పిటిషనర్లు ఎదురు చూస్తున్నారని తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో ధరణి అదాలత్‌లు నిర్వహించడంతోపాటు ధరణి పోర్టల్‌పై ఫిర్యాదులను నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

15 శాతం వృద్ధి లక్ష్యం : ఆండ్రోమెడా

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.60వేల కోట్ల రుణాలను పంపిణీ చేశామని ఆండ్రోమెడా సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత 2023-24లో 12-15 శాతం వృద్ధి అంచనా వేస్తున్నామని పేర్కొంది. 2022-23లో గృహ రుణ విభాగంలో 50.4 శాతం వృద్ధితో రూ.23,328 కోట్ల అప్పులిచ్చినట్లు పేర్కొంది. సిటీబ్యాంక్‌కు సేల్స్ అసోసియేట్‌గా 1991లో ఆండ్రోమెడా కార్యక్రమాలు ప్రారంభించింది. ప్రధానంగా గృహ, తనఖా, వ్యక్తిగత, వ్యాపార రుణాలు అందిస్తుంది.

యురేనియం తవ్వకాలతో ప్రమాదం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింహారావు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు చేపడితే పర్యావరణానికి తీవ్ర ప్రమాదమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు అన్నారు. యురేనియం విషయంలో బిజెపి నేత, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మాటలాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని డీకే తిరుమలాపూర్, డీకేఉప్పునుంతల గ్రామాల్లో సిపిఎం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా డిజి నర్సింహారావు మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాల విషయంలో కేంద్రం మొండిగా వ్యవహరిస్తే ప్రతిఘటిస్తామన్నారు. యురేనియం వ్యతిరేక ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. బిజెపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పంపిన బృందం నల్లమలలో బోరు బావులు తవ్వి.. యురేనియం, బాక్సైటు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రిపోర్టు ఇచ్చిందని తెలిపారు. గతంలోనూ యురేనియం తవ్వకాలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. యురేనియం వెలికి తీయడం వల్ల పదిమంది పారిశ్రామికవేత్తలకు తప్ప సాధారణ ప్రజలకు ఎటువంటి ఉపయోగాలూ లేవన్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేస్తే ఎటూ 80 కిలోమీటర్లు కాలుష్యం ఏర్పడటమేగాక సాగు, తాగునీరు కలుషితం అవుతుందని చెప్పారు. హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలు పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదం ఉందన్నారు. కృష్ణానదితో పాటు గోదావరి వంటి జీవనదులు సైతం కలుషితమై ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో



రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, మేధావులు, శాస్త్రవేత్తలు కలిసి చేసిన ఉద్యమ ఫలితంగా కేంద్రం వెనక్కి తగ్గిందని, ఇప్పుడు మరోసారి నల్లమల అటవీ విధ్వంసానికి కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఉద్యమాల ద్వారానే ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. యురేనియం వెలుగు తీసిన ప్రాంతాల పరిస్థితి నేడు దయనీయంగా ఉందన్నారు. తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లోనూ యురేనియం తవ్వకాలు జరపనివ్వబోమని హెచ్చరించారు. చీటికిమాటికి యురేనియం తవ్వకాల అంశం ముందుకు తెస్తున్న బిజెపిని నల్లమలలో ఓడించి తీరాలని పిలుపునిచ్చారు. నల్లములలో దాగి ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికే కేంద్రం పావులు కలుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదో షెడ్యూల్లో పొందుపరిచినట్టుగా ఈ ప్రాంతంలో ఏ నిర్మాణం చేపట్టినా గిరిజనుల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని నిబంధనలు ఉన్నా బిజెపి పట్టించుకోవడం లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోడీ చెప్పినట్టుగానే రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ యురేనియం విషయంలో మాట్లాడాలన్నారు. దేశ సంపదను అదానీ అంబానీలకు తాకట్టు పెట్టడానికే యురేనియం తవ్వకాలు వంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండలో క్లోరైడ్ సమస్య మాదిరిగా తెలంగాణ మొత్తంగా యురేనియం సమస్య తీవ్రంగా రానున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులు, రైల్వే, విమానం, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటున్న బిజెపి ప్రభుత్వం.. నేడు యురేనియంపై దృష్టిసారించిందని చెప్పారు. చెంచులు చిన్న చెట్లను కొట్టినా నానా యాగి చేసి కేసులు పెడుతున్న అటవీ అధికారులు.. యురేనియం తవ్వకాలకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు.

ఈ బృందంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ధర్మనాయక్, శీరామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ రాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సంఘం నాయకులు దేశ్యా నాయక్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో క్రెచ్

- హైదరాబాద్ సిపి సివి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీస్ ఉద్యోగం అంటేనే రిస్క్‌తో కూడుకున్నది. బందోబస్తులు, శాంతిభద్రతలో భాగంగా ఎప్పుడు ఎక్కడుంటారో, ఎక్కడ విధులు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి. ఇక మహిళా పోలీసులకు చిన్నపిల్లలుంటే వారి సమస్యలు వర్ణనాతీతం. అటు ఉద్యోగం, ఇటు చిన్నపిల్లల సంరక్షణ ఇబ్బందికరంగా మారుతుంది. ఈ క్రమంలో పోలీస్‌శాఖలో పనిచేస్తున్న చిన్న పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగుల కోసం హైదరాబాద్ సిపి సివి ఆనంద్ సరికొత్త ఆలోచన చేశారు. రోజుల చిన్నపిల్లల నుంచి ఐదేండ్ల పిల్లల సంరక్షణ చూసేందుకు వీలుగా పేట్లబూర్జులోని పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో అధునాతన హంగులతో క్రీచ్ (శిశువులను జాగ్రత్తగా చూసే స్థలం)కు శనివారం శంకుస్థాపన చేశారు. మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థ ఆర్థిక సహాయంతో రూ.4.5 కోట్లతో ఈ క్రీచ్‌ను నిర్మిస్తోంది. ఈ సందర్భంగా సిపి సివి ఆనంద్ మాట్లాడుతూ.. నగర కమిషనరేట్‌లో 18432 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, అందులో 600 మంది మహిళా పోలీస్ అధికారులు ఉన్నారని తెలిపారు. ప్రతి రోజూ ఎన్నో సవాళ్లతో మహిళ ఒత్తిడికి గురవుతుందన్నారు. మహిళా ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు పోలీస్ శాఖలో మెరుగైన సౌకర్యాలకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ క్రీచ్‌లో తాగునీటి సదుపాయం, వంట సామగ్రి, టాయిలెట్, ఆట వస్తువులు, వైద్య సదుపాయంతోపాటు పిల్లలు నిద్రపోయేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్మార్ట్ టీవీ, ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు, విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాట్లతోపాటు బాలింతలు పాలివ్వడానికి ఫీడింగ్ సెంటర్‌ను అత్యాధునిక సదుపాయలతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. చిన్నారుల భద్రతలో భాగంగా ప్రత్యేకంగా సీసీటీవీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దాదాపు 100 మంది పిల్లలను సంరక్షించే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, వచ్చే నవంబర్ 14వరకు పూర్తవుతుందని చెప్పారు. చిన్నారుల సంరక్షణ విషయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ట్రైయిండ్ స్టాఫ్‌ను నియమిస్తామని సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సీపీ ఏ.ఆర్.శ్రీనివాస్, జాయింట్ సీపీ ఎం.శ్రీనివాసులు, డీసీపీలు శిరిషా రాఘవేంద్రా, సాయి చైతన్యతోపాటు ఎంఈఐఎల్ డైరెక్టర్లు పామిరెడ్డి రామా రెడ్డి, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాజమాన్యంతో విద్యుత్ జెఎసి చర్చలు సఫలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావుతో విద్యుత్ ఉద్యోగుల జెఏసి శనివారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఏడు శాతం పిఆర్‌సికి విద్యుత్ ఉద్యోగులు అంగీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి, సిఎండి ప్రభాకర్‌కు ఉద్యోగులు ధన్యావాదాలు తెలిపారు. ఈ నెల 17 నుంచి తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిఎస్‌పిఇ జాక్) తలపెట్టిన సమ్మె విషయంలో తెలంగాణ లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని, సయోధ్య కుదుర్చాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకర్‌రావు కోరిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 7న లేబర్ కమిషనర్‌కు ప్రభాకర్‌రావు లేఖ రాశారు. టిఎస్‌పిఇ జాక్‌తో ఇప్పటికే ఐదుసార్లు చర్చలు జరిపామని, విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఆరు శాతం ఫిట్‌మెంట్‌కు ప్రతిపాదించామని వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో శనివారం జరిగిన చర్చలు విజయవంతమయ్యాయి. ఏడు శాతం పిఆర్‌సికి విద్యుత్ ఉద్యోగులు అంగీకరించారు. దీంతో రేపటి నుంచి తలపెట్టిన సమ్మె విరమించుకున్నారు.



అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీ చేపట్టిన సర్పంచ్‌లు

పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సర్పంచుల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచులు డిమాండ్ చేశారు. నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరుతున్న సమయంలో మున్సిపల్ పార్కు దగ్గర సర్పంచులను పోలీసులు అడ్డగించారు. పోలీసులకు సర్పంచులకు కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజింగ్ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు -మనబడికి సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద చేసిన బిల్లులు కూడా విడుదల కాలేదన్నారు. ఎస్‌టీఓలో పెండింగ్ చెక్కులు వెంటనే పేమెంట్స్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్‌కు సర్పంచ్‌లు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

అస్వస్థతతో గురుకుల విద్యార్థిని మృతి

- ఆస్పత్రి ముందు పలు రాజకీయ పార్టీల ధర్నా
- భారీ పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తీవ్ర అస్వస్థతకు గురైన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని మృతిచెందింది. ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. విషయం తెలిసి ఆస్పత్రికొచ్చిన తల్లిదండ్రులు కుప్పకూలారు. తల్లి అస్వస్థతకు గురైంది. ఈ ఘటన శనివారం కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలో జరిగింది. కళాశాల సిబ్బంది, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం..

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన సమ్మయ్య-లలిత దంపతుల పెద్ద కూతురు సోదరి శ్రీవాణి(14) సిర్పూరు (టి) మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గురువారం పాఠశాలలోనే ఆమెకు నడుం నొప్పి, కాళ్లు గుంజుతున్నాయని ఇబ్బందిపడటంతో హెల్త్ సూపర్‌వైజర్ అంజలి చికిత్స చేశారు. శుక్రవారం ఉదయం మరోసారి నొప్పి రావడంతో ఆమెను సిర్పూరు (టి) మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. బయటనే రక్తపరీక్షలు చేయగా రక్తం తక్కువగా ఉన్నట్టు రిపోర్ట్ వచ్చింది. ఆస్పత్రిలో వైద్యులు జోగిందర్ రెండు ఇంజక్షన్‌లు చేసి తిరిగి పాఠశాలకు పంపించారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి పరీక్షలు జరుగుతుండటం, శనివారం చివరి పరీక్ష కావడంతో ఉదయమే శ్రీవాణి అల్పాహారం చేసి పరీక్ష రాసింది. పరీక్ష రాసే క్రమంలోనే తనకు కండ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో వెంటనే హెల్త్ సూపర్‌వైజర్ ఆస్పత్రికి తరలించారు. ఆక్సిజన్ పల్స్ తగ్గటం.. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో తరలిస్తున్న క్రమంలో బాలిక మార్గమధ్యలోనే తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. అయితే, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా బాలిక మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ క్రమంలో ఆస్పత్రి వద్ద భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రుల రోధన

తమకు గురుకులం నుంచి ఎలాంటి సమాచారమూ ఇవ్వలేదని, ఈ రోజే తమ కూతురు ఆరోగ్యం బాగోలేదని చెప్పారని తండ్రి సమ్మయ్య తెలిపాడు. కూతురిని మంచిర్యాలకు తీసుకొస్తున్నామని, అక్కడికి రావాలని ముందు చెప్పారని, తర్వాత కాగజ్‌నగర్‌కు రావాలని చెప్పారన్నారు. తన మూడేండ్ల మరో కూతురిని ఎత్తుకొని తల్లి లలిత ఆస్పత్రి ఆవరణలో గుండెలవిసేలా ఏడ్చింది. అస్వస్థతకు గురైన లలితను మహిళా పోలీసులు ఆస్పత్రి లోపలికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. ఆమెకు కూతురి మృతదేహాన్ని చూపించకుండా.. తండ్రి సమ్మయ్యకు మాత్రమే కుమార్తె మృతదేహాన్ని చూపించారు.

పాలు పార్టీల ధర్నా

బాలిక మృతి విషయం తెలుసుకున్న పలు రాజకీయ పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ.. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ముందు ధర్నాకు దిగారు. సిపిఎం నాయకులు ముంజం ఆనంద్‌కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు పాల్వాయి హరీష్‌బాబు, బిఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్‌హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావి శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం ధర్నా చేశారు.

మోడీ విధానాలు పెన్షనర్లకు వ్యతిరేకం

- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఐదో మహాసభలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు విధానాలు..పెన్షనర్లకు వ్యతిరేకంగా ఉన్నాయని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ఐక్యతా, పోరాటం, సామాజిక స్పృహతో పోరాటాలు నిర్వహిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఐదో మహాసభలు అసోసియేషన్ అధ్యక్షులు పి కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు నర్సిరెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఆర్థిక విధానాల్లో తీవ్ర మార్పులొచ్చాయని గుర్తుచేశారు. నూతన ఆర్థిక విధానాల అమలుకు ముందు ఎంతో కొంత కనీస రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా పాలనా విధానాలు ఉండేవని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు పరం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతతో కాకుండా పెన్షనర్ల విషయాన్ని ఆదాయ వనరుగా చూడటం బాధాకరమన్నారు. దేశంలో మెజార్టీ ప్రజలకు పొట్టనిండా తిండి లేకున్నా..మతాలు, వాటి ఉన్మాదాన్ని ప్రేరేపిస్తున్న పాలనలో మనమున్నామని చెప్పారు. ఈహెచ్‌ఎస్ కార్డు అనేది పేరుకే ఉందని తెలిపారు. రీయింబర్స్‌మెంట్ కోసం పెద్ద పోరాటమే చేయాల్సి వస్తున్నదన్నారు. ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అతుల్ డిగ్గే మాట్లాడుతూ.. పెన్షన్లు పెంచని ప్రభుత్వాన్ని ఓడించేందుకు నిరంతర పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ప్రజలకు, పెన్షనర్లకు, రైతులకు, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధానాలను మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్నదని చెప్పారు. ఈపీఎఫ్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టడమేంటని ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ... అనేక దేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల బాధ్యతను ప్రభుత్వాలే చూసుకుంటున్నాయని తెలిపారు. పెన్షనర్ల సాధారణ కోర్కెలను కూడా నెరవేర్చకుండా సర్కార్ నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. పిఎఫ్ కాజేసే బిల్లు 1995లోనే వచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు మాత్రమే సమ్మె చేసిందని గుర్తు చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షనర్లకు రైళ్లల్లో ఉన్న కనీస సౌకర్యాలు కూడా కత్తిరించారని చెప్పారు. పెన్షనర్లు హిందువులు కాకుండా పోయారా?అని ప్రశ్నించారు. ఎఐసిసిఇపిఎస్‌పిఎ చైర్మెన్ ఎంఎన్ రెడ్డి, టిఎపిఆర్‌పిఎ ప్రధాన కార్యదర్శి మచ్చా రంగయ్య, స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ జెఎసి చైర్మెన్ కె లక్ష్మయ్య, ఎస్‌టిఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు చావ రవి, తదితరులు ప్రసంగించారు.